క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన అనిత



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అనిత

ఉండి: రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొరపాటి అనిత గురువారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు అనిత తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

పాలకోడేరు: వాసవీ క్లబ్ అనేక ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తుందని వాటిని ప్రజలంతా వినియోగించుకోవాలని వాసవీ క్లబ్ 202ఏ జోన్ చైర్మన్ గాదంశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం శృంగవృక్షం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు బులి నాగేశ్వరరావు గుప్త, స్వర్ణ దంపతుల సౌజన్యంతో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సత్యకృష్ణ, హెచ్ఎం కోడి సత్యనారాయణ, సోము దుర్గాభవానీ, సబ్బిత లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం



కృష్ణానంద పురి స్వామీజీ విగ్రహానికి అర్చన నిర్వహిస్తున్న పీఠాధిపతులు

పెనుగొండ: పెనుగొండ వాసవీ శాంతి ధామ్ క్షేత్ర ప్రథమ పీఠాధిపతులు కృష్ణానంద పురి స్వామీజీ ప్రథమ ఆరాధన మహోత్సవాన్ని పలువురు పీఠాధిపతులు ఘనంగా నిర్వహించారు. గురువారం అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి ధాంలో క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాల స్వామీజీ పర్యవేక్షణలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కృష్ణానంద పురి స్వామీజీ పాదుకులకు పంచామృతాభిషేకం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 15 మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, మాతాజీలు హాజరై స్వామీజీ సేవలను, ఆధ్యాత్మిక చింతనను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ, కోట్ల వెంకటేశ్వరరావు, నార్కెడమిల్లి జనార్ధన్ పాల్గొన్నారు.

సిద్ధాంతంలో మావుళ్లమ్మ జాతర ప్రారంభం



సిద్ధాంతంతో మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభించారు. బుధవారం రాత్రి అమ్మవారిని నిలబెట్టి గ్రామ దర్శనం చేసి, ఉదయం ఉత్సవాలు ప్రారంభించారు. గ్రామంలోని గరగాలమ్మ, సోమాలమ్మ, పోతురాజులకు చలివిడి పానకాలు సమర్పించారు. ఈ నెల 29వరకూ ఉత్సవాలు కొనసాగుతాయని మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. 24న రాత్రి మావుళ్లమ్మ అమ్మవారికి నవగ్రహ వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహిస్తామన్నారు. 25,26,27 తేదీలో తీర్థ మహోత్సవాలు, 29న భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

పార్టీ పదవులు బాధ్యతగా నిర్వహించాలి

నరసాపురం: పార్టీ అప్పగించిన పదవులను బాధ్యతగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నడపన చిన్ని గురువారం రాత్రి ముదునూరిని ఆయన నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా పూర్తి బలోపేతం చేసే చర్యల్లో భాగంగా మండల కమిటీలను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మండలె కృష్ణ, చిట్టూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ: అక్షయ పాత్ర ఆధ్వర్యంలో గురువారం వడలి ఎన్టీఆర్ కూడలి వద్ద ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పెనుగొండలో ఓ కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను వడలి అక్షయ పాత్ర సభ్యులకు అందించడంతో వాటిని పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర సభ్యులు ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పంట కాలువలు

- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- పట్టించుకోని అధికారులు



ఉండి పంట కాలువలో అడ్డుపడిన గుర్రపు డెక్క, చెత్తాచెదారం



ఉండి పంటకాలువలో జంతు మృతకళేబరం

ఉండి: ఉండి కాలువకు నీరు విడుదల చేసి సుమారు వారం రోజులు పైబడి కావస్తుంది. కానీ ఇప్పటికీ నీరు కంపుకొడుతూనే ఉంది. ముఖ్యంగా కాలువలో కొట్టుకొస్తున్న జంతు కళేబ్బరాలు, చెత్తాచెదారంతో పాటు ఇతర వ్యర్థాలు కూడా కాలువనీటిలో కొట్టుకురావడంతో నీరు దుర్గంధం వెదజల్లుతుంది. దీనికి తోడు కాలువపై ఉండే వంతెనలు, చెట్లు వద్ద అడ్డుపడుతున్న గుర్రపుడెక్క, జంతు కళేబరాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బ్రిడ్జిల వద్ద జంతుకళేబరాలు అడ్డుపడడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు. మండలానికి ఎగువన కాలువలో కుక్కలు, పందులు వంటి జంతువుల కళేబరాలు కాలువల్లో పారవేయడంతో అవి కాస్త ఉండి కావుల శివారు ప్రాంతం అయిన ఉండి, కలిసిపూడి, చెరుకువాడ ప్రాంతాల్లోకి చేరుకుని దుర్గంధం వెదజల్లుతున్నాయి. అలాగే కొన్నిసార్లు మానవ మృతదేహాలు కూడా కాలువలో కొట్టుకురావడంతో ఉండి, కలిసిపూడి, చెరుకువాడ ప్రాంతానికి చెందిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాలను వెలికితీస్తున్నారు.

ఈ నీరే సాగు, తాగునీరు

ఉండి కాలువ ముందుగా ఉణుదుర్రు ప్రాంతంలో ప్రవేశించి యండగండి లాకుల వద్ద నుంచి కాలువ శివారు ప్రాంతం అయిన చెరుకువాడ వద్దకు చేరుతుంది. అయితే మండలంలో సుమారు 17 గ్రామాల ప్రజలతో పాటు కాళ్ల మండలంలోని మరో నాలుగు గ్రామాల ప్రజలకు ఉండి పంట కాలువ ద్వారా సాగు, తాగునీరు అందుతుంది. సాగునీటి సంగతి అటుంచితే తాగునీటి గురించే ప్రజలు భయపడిపోతున్నారు. దానికి కారణం ఉండి కాలువ నీటినే ఆయా గ్రామాల పంచాయితీ చెరువుల్లోకి మళ్లించి వాటిని రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా తాగునీరుగా ప్రజలకు అందిస్తున్నారు. ఈ కుళ్లిన కళేబరాలు ఉన్న నీటిని తాగిన ప్రజల ఆరోగ్య పరిస్థితి ఏమవుతుందో ఊహించవచ్చునని ప్రజలు భయపడిపోతున్నారు.

కమిటీల పేరుతో కాలయాపన

ఉండి కాలువకు నీరు విడుదల కాకముందు మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొందరు కమిటీగా ఏర్పడి పంట కాలువ ప్రక్షాళన చేస్తున్నామని చెప్పి కాలువ గట్టుపై నివాసం ఉంటున్న వారు కాలువలోకి పెట్టిన వాడకం నీటి పైపులను తొలగించారు. మంచి కార్యక్రమమని చాలా మంది వారిని అభినందించారు. అంతే వారితోపాటు అధికారులు కూడా చేతులు దులుపుకుని వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు పంటకాలువ నీరు దుర్వాసన వెదజల్లుతున్నా, అదే నీటిని ప్రజలు తాగాల్సి వున్నా సదరు కమిటీ పెద్దలు గానీ అధికారులు గానీ ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు కాలువల్లో చెత్తాచెదారం, మృతకళేబరాల తొలగింపు చర్యలు ఎందుకు చేపట్టడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరోసారి కాలువను పరిశీలించాలి



కాలువలకు నీరు విడుదలైన తర్వాత భయంకరమైన చెత్తాచెదారం కొట్టుకువచ్చింది. అయితే దానిలో కొంతభాగం మునిగిపోవడంతోపాటు కొట్టుకుపోయింది. అయితే మరి కొంత వంతెనలు, పలు ప్రాంతాల్లో అడ్డుపడింది. అదికాస్త కుళ్లిపోయి స్థానికులకు కంపుకొడుతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి కుళ్ళును,చెత్తాచెదారాన్ని తొలగించాలి.

– అంగర రాంబాబు, ఉండి

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి



కంపుకొడుతున్న నీటిని ఎంత శుద్ధి చేసినా ప్రజారోగ్యానికి నష్టం వాటిల్లుతుంది. కాబట్టి అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని సిబ్బంది సహకారంతో కాలువల్లో అడ్డుపడే చెత్తా చెదారం, కళేబరాలను వెంటనే తొలగిస్తూ ఉండాలి. వేలాది మంది తాగేనీటిని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతారు. తాగునీటి విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి.

– వెలగపల్లి టోని, యండగండి

ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి

భీమవరం: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో జూన్ నెల వేతనాలు అందేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి ప్రకాశం, బివి నారాయణ గురువారం ఒకప్రకటనలో కోరారు. పొజిషన్ ఐడి, సిఎఫ్ఎంఎస్ అనుసంధానం సమస్య లేకుండా ట్రెజరీ అధికారులకు విద్యాశాఖ సమగ్ర నివేదికను పంపాలని కోరారు. కొత్తగా ఏర్పడ్డ పిఎస్ హెచ్ఎం పోస్టులు, రీ అపోస్మెంట్ ఖాళీల లో చేరిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనం సకాలంలో అందేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నాన్ డ్రాయిల్ సర్టిఫికెట్‌తో కొత్త పాఠశాలల్లోనే పూర్తి వేతనం చెల్లించేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఎక్సైజ్ దాడులు



బెల్ట్ షాపు నిర్వాహకుడు, స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

వీరవాసరం: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన దాడులలో వీరవాసరం గ్రామంలో సీహెచ్. వెంకట్రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 07 మద్యం బాటిళ్లను స్వాధానం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐలు పి.ఉమా మహేశ్వర రావు, పి. సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇనెస్పెక్టర్ కె.బలరామరాజు తెలియజేశారు.

విద్యార్థులను మోసం చేసిన కూటమి సర్కార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేసిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి విమర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో గురువారం ఏఐఎస్ఏ కార్యకర్తల సమావేశం పి.రాజేష్ అధ్యక్షతన జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ షరతులు విధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 29 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు ఎగనామం పెట్టారని మండిపడ్డారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు: స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలోని 11 కేవీ లైన్లలో మొక్కల తొలగింపు, కటింగ్ నిమిత్తం శుక్రవారం స్థానికంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ శాఖ అధికారి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఇండస్ట్రీయల్, ధర్మాపుర అగ్రహారం ప్రాంతాల్లో సరఫరా ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తాడేపల్లిగూడెం రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన మండలంలోని వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెడ్డి నవ్యకు రూ.10వేలు ప్రోత్సాహక బహుమతిని గురువారం దాత కేతిరెడ్డి సుబ్బారెడ్డి అందజేశారు. అలాగే, 500లకు పైబడి మార్కులు సాధించిన ఏడుగురికి రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పురవీధుల్లో జాతర దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం వెలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠ మాస జాతర మహోత్సవాలను నిరూల్లికూరగాయ పండ్లవర్తక సంఘం , అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరించిన హంస వాహనంలో కొలువుంచగా స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి జాతరను ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళ్లతో, సన్నాయి వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో అసాధులతో నృత్యాలతో, అమ్మవారి వేషదారుణలతో ఘనంగా అమ్మవారి జాతర నిర్వహించారు. పట్టణ పురవిధుల్లో అమ్మవారి జాతర కన్నుల పండగగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి జాతరను తిలకించారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్, నిరూల్లికూరగాయ పండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో రుగ్మతలు దూరం



భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో యోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

భీమవరం: ప్రతినిత్యం యోగా సాధన చేయడం వల్ల అనేక శారీరిక, మానసిక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని పలువురు వక్తలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్‌ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలలో గురువారం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ ప్రతివ్యక్తి మన దినచర్యలో భాగంగా కొంతసేపు యోగా చేయడం ద్వారా ప్రతి అవయవానికి రక్త ప్రసరణ జరిగి వ్యాధులకు దూరంగా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునన్నారు. యోగా ద్వారా ఆలోచన శక్తి పెరిగి విద్యా రంగంలో ముందుకు సాగుతారన్నారు. అనంతరం యోగ గురువు గోపాలశర్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్ అనురాధ, వైస్ ప్రిన్సిపల్ బి మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, ఏవో జయకుమార్, అరసవల్లి మణికంఠ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి



సీడీపీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

ఆకివీడు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మార్తమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏ సంక్షేమ పథకం అమలు చేయడంలేదని, తల్లికి వందనం కూడా తమకు అమలుజేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పింఛన్ల సదుపాయం కూడా తమకు కల్పించడంలేదని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగ పేరుతో పథకాలు నిలుపుదల చేశారని, కుటుంబంలోని ఎవరికీ పథకం వర్తింపజేయలేదని ఆరోపించారు. రూ.12 వేలు లోపు జీతం ఉన్న వారికి పథకాలు ఇవ్వాలని జీఓ విడుదల చేసినా ఒక్క పథకం అందజేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వ పథకాలు అమలుజేసే విధంగా జీఓ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూపర్‌వైజర్ రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.రాంబాబు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నకుమారి

ఆకివీడు: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని, అదే విధంగా మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ రత్నకుమారి పిలుపునిచ్చారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో మహిళల్లోచైతన్యం, అక్రమ రవాణా నిరోధంపై గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమాల్లో ఛాన్స్, సీరియల్స్‌లో ఛాన్సు, విదేశాలకు పంపుతామంటూ, అధిక డబ్బు ఆశ చూపి మహిళలకు, పిల్లలకు మోసపూరిత మాటలు చెప్పి అక్రమంగా తరలిస్తున్న ముఠాలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ ముసుగులో మహిళలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సైబర్ నేరాలు చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదాలకు గురైన సందర్భంలో 1098,100, 181,1930లకు ఫోన్‌చేసి రక్షణ పొందాలని సూచించారు.

సార్వా సాగుకు సన్నద్ధం



నారుమడికి మడిని సిద్ధం చేస్తున్న దృశ్యం



పెనుగొండ మండలంలో సాగుకు దమ్ము చేస్తున్న రైతు

- పనుల్లో నిమగ్నమైన రైతన్నలు
- ఉత్సాహంగా నారుమడులు

పెనుగొండ: తొలకరి చినుకులు ప్రారంభం కావడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. సాగుకు అనుకూలమైన మృగశిర కార్తె తొలి రోజు నుంచి రైతులు సార్వా సాగుకు అనువైన వరి వంగడాలను సిద్ధం చేసుకున్నారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లోనూ ఆచంట మండలంలో 10600 ఎకరాల్లో , పోడూరుమండలంలో 12800 ఎకరాల్లో వరి సాగు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. కాలువలకు నీరు రావడంతో పంట కాలువల్లోకి నీరు చేరడం ప్రారంభించింది. దీంతో కాలువ మొగలో ఉన్న రైతులు చేలల్లోకి నీటిని వదులుకుని నారుమడులు వేయడానికి దమ్ములు చేయడం ప్రారంభించారు.

ఎంటీయూ 1318పై ఆసక్తి

సార్వా సాగుకు అనువైన వరి వంగడాలైన ఎంటీయూ 1318, ఎంటీయూ 2072(స్వర్ణ) రకాలను సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. దీనిలో ఎంటీయూ 1318 రకం వంగడాన్ని ఎక్కువ మంది సాగు చేయనున్నారు. ముందుగా పెనుగొండ మండలంలోని కాలువ పరివాహక ప్రాంతాల్లో సాగు పనులు నాలుగు రోజులుగా జోరుగా సాగుతున్నాయి.పెనుగొండ, వెంకట్రామపురం, వడలి, సిద్ధాంతం గ్రామాల్లో పనులుజోరుగా ప్రారంభమయ్యాయి. వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు. భారీ వర్షాలు పడకుండా ఉంటే నారుమడులకు ఎలాంటి నష్టం ఉండదని, విత్తనాలు జల్లిన అనంతరం ఏమాత్రం వర్షం పడినా మరోసారి విత్తనాలు జల్లుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఎలాంటి ఆటంకం లేకుండా సాగు పనులు ముందుకు సాగాలని రైతులు కోరుకుంటున్నారు.

రూ.60 కోట్లకు పైగా బకాయిలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగుకు ముందే పెట్టుబడి సాయం రూ.7500 ఇచ్చే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఇప్పటివరకు రైతులకు పట్టించుకోవడం వాపోతున్నారు. దాళ్వా సీజన్‌లో ధాన్యం డబ్బులు ఇంకా రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో రూ.60 కోట్లకు పైగా రైతులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని వారు తెలిపారు. మే మొదటి వారం నుంచి రైతులకు చెల్లింపులు నిలిచిపోవడంతో సార్వా సాగుకు పెట్టుబడులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు కోసం అప్పులు చేసి సాగు చేస్తున్నామని వాపోతున్నారు. ఈ తరుణంలో సార్వా సాగు కష్టసాధ్యంగా మారిందన్నారు. సత్వరం చెల్లింపు చేసి సాగుకు పెట్టుబడులు అందించాలని కోరారు.

పెనుమర్రులో పూర్తయిన రీ–సర్వే



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం , 1923లోని సెక్షన్ 13 ప్రకారం పెనుమర్రు గ్రామంలో వ్యవసాయ భూముల రీసర్వే పూర్తి అయిందని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. రీ సర్వే పూర్తయిన సందర్భంగా రైతులకు భూమి వివరాలు వివరించడానికి స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం గ్రామ సభ ఏర్పాటుచేశారు. గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి ద్వారా ప్రచురించిన రీసర్వే ప్రకారం గ్రామ విస్తీర్ణం 783.05 ఎకరాలకు గాను సుమారు అర ఎకరం విస్తీర్ణం తగ్గి 782.526 ఎకరాలు వచ్చిందని చెప్పారు. గ్రామంలో మొత్తం 1283 ఎల్‌పీఎంలు వచ్చాయన్నారు. వీటిలో 42 జాయింట్ ఎల్‌పీఎంలు వచ్చాయన్నారు. 42 జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించిన రైతులు వారికి సంబంధించిన సరిహద్దులు నిర్ధారించుకుని సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కవురు నాగలక్ష్మి, వీఆర్వో కొడవటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు ఉచిత నీలి నాలుక నివారణ టీకాలు

నరసాపురం రూరల్: గొర్రెలకు ఉచిత నీలి నాలుక టీకాల (బ్లూటంగ్) కార్యక్రమాన్ని గొర్రెల రైతులు సద్వినియోగం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని చిట్టవరం గ్రామంలో గురువారం గొర్రెలకు, నీలి నాలుక వ్యాధి నివారణకు టీకా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో 800 గొర్రెలకు, నీలి నాలుక వ్యాధి టీకాలు వేసినట్లు సురేంద్ర తెలిపారు. టీకాల ఆవశ్యకతను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కొంతేరు దేవాలయ భూముల కౌలు వేలం

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి చెందిన భూములను కౌలుకు సాగు చేసుకునేందుకు గురువారం భీమవరం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. దేవస్థానం భూములు తొమ్మిది ప్రతులుగా సుమారు 26 ఎకరాలు ఉండగా 3 సంవత్సరాల కాలపరిమితికి వేలం నిర్వహించారు. ఈ భూమిలో 2.28 ఎకరాలకు సంబంధించి ఒక రైతు కౌలు బకాయి ఉండడంతో ఆ భూమికి వేలం వేయలేదు. మిగిలిన భూములకు ఏడాదికి రూ.4,56,500 ఆదాయం వచ్చింది. తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన వేలంలో కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్‌లు నల్లం రామకృష్ణ, బి భద్రరావు, కోళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.